క్లుప్తంగా

అవార్డు గ్రహీతకు ఎమ్మెల్సీ అభినందనలు



ఉమెన్ ఐకాన్ అవార్డు గ్రహీత జ్యోతిని అభినందిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అల్లవరం: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లో జరిగిన మహిళా దినోత్సవ వేడుకల్లో ఉమెన్ ఐకాన్ నేషనల్ అవార్డు–2024 సాధించిన కొమరగిరిపట్నం గ్రామానికి చెందిన కట్టా జ్యోతి గోడిలోని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌ను గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జ్యోతిని ఎమ్మెల్సీ దుశ్శాలువాతో సత్కరించారు. మరింత మెరుగైన సేవలందించి మండలానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, ఎంపీడీఓ కృష్ణమోహన్‌ను ఆమె మర్యాద పూర్వకంగా కలిశారు.

వలంటీర్ల సేవలకు వందనం



వలంటీర్లను సత్కరిస్తున్న కౌన్సిలర్ నాగ సుధారాణి

అమలాపురం టౌన్: వార్డు, గ్రామ సచివాలయాల ద్వారా వలంటీర్లు ప్రజలకు అందిస్తున్న సేవలకు అందరూ వందనం చేయాల్సిందేనని కౌన్సిలర్ దొంగ నాగ సుధారాణి అన్నారు. స్థానిక 25వ వార్డు సచివాలయంలో పరిధిలో ఉన్న 18 మంది వలంటీర్లను ఆమె శుక్రవారం సాయంత్రం సత్కరించారు. వలంటీర్ల సేవలకు గాను ప్రభుత్వం నగదు పురస్కారాలు అందించి సత్కరించడం మంచి పరిణామమన్నారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ కన్వీనర్ దొంగ చిన్నా, వార్డు సచివాలయ అడ్మిన్, కార్యదర్శులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లకు భూమి పూజ



సీసీ రహదారులకు భూమి పూజ చేసిన జెడ్పీటీసీ సభ్యుడు శామ్యూల్ సాగర్

తాళ్లరేవు: తాళ్లరేవు గ్రామపంచాయతీ పరిధిలోని కేశవస్వామి కాలనీలో రూ.9 లక్షల 15వ ఆర్థిక సంఘం నిధులతో అంతర్గత రహదారుల నిర్మాణానికి జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి శామ్యూల్ సాగర్ శుక్రవారం భూమి పూజ చేశారు. స్థానిక కాలనీలోని కాజా శ్రీనివాసరావు గృహం నుంచి బూలా గిరిబాబు ఇంటి వరకూ, గుత్తుల ఈశ్వరరావు ఇంటి నుంచి మేడిశెట్టి గొల్లయ్య ఇంటి వరకూ రహదారులు నిర్మించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డి సుహాసినిదేవి, మాజీ సర్పంచ్ రెడ్డి బాబు, వార్డు మెంబర్ టేకుమూడి రాంబాబు, సచివాలయ కార్యదర్శి వేణుగోపాలస్వామి, ఇంజినీర్ శ్రీనివాస్, మండల వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి బొంతు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

అల్లవరం: తుమ్మలపల్లి పంచాయతీ పరిధిలోని రెండు ప్రాంతాల్లో సీసీ రోడ్డుకు ఎంపీటీసీ పులుసుగంటి రాజేశ్వరి శుక్రవారం శంకుస్థాపన చేశారు. జీజీఎంపీ నిధులు రూ.5 లక్షలతో సావరం మెరకలో, రూ.12.70 లక్షలతో మెయిన్‌రోడ్డు నుంచి ఎంపీపీ స్కూల్ వరకూ సీసీ రోడ్డు నిర్మించనున్నామని ఎంపీటీసీ తెలిపారు. కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షుడు బళ్ల శ్యామ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు కాట్రు శాంతికిరణ్, మాజీ సర్పంచ్ పందిరి సూర్యనారాయణ, మాజీ ఎంపీటీసీ పులుసుగంటి ప్రసాదరావు, కన్వీనర్లు మల్లాడి రాధాకృష్ణ, కాట్రు ఝాన్సీ, పొలమూరి శ్రీనివాస్, చెల్లి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

లింగ్విస్టిక్స్ అండ్ కల్చర్‌లో ఖాళీలు

యానాం: పుదుచ్చేరి ఇనిస్టిట్యూట్ ఆఫ్ లింగ్విస్టిక్స్ అండ్ కల్చర్ శాఖలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసినట్లు డైరెక్టర్ వి.కలైపెరుమాల్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 24వ తేదీలోగా లింగ్విస్టిక్స్–3, తమిళ లిటరేచర్–3, ఆంత్రోపాలజీ–2, ఫోక్‌లోర్–1లకు పీఐఎల్‌సీ.పీవై.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన

అల్లవరం: ప్రపంచ వినియోగదారులు దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వినియోగదారుల చట్టాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కృష్ణమోహన్ మాట్లాడుతూ వినియోగదారులకు అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాలని కార్యదర్శులను ఆదేశించారు. సార్వత్రిక ఎన్నికల కోడ్ రానున్న తరుణంలో గ్రామాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. వేసవి నేపథ్యంలో ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా ఇంజినీరింగ్ అసిస్టెంట్లు నిత్యం పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు రాజమోహన్, రాజా, కేవీవీ సత్యనారాయణ, శ్రీరామచంద్రమూర్తి, దుర్గా శ్రీనివాస్, చిక్కం శ్రీను, కుమారి, నవీన పాల్గొన్నారు.

రహదారుల్లో రయ్.. రయ్..



పెదగోవలంకలో వేసిన సీసీ రహదారి



పటవల ఎస్సీ పేటలో వేసిన సీసీ రోడ్డు

- రోడ్ల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- మండల పరిషత్ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం

తాళ్లరేవు: ఎంతోకాలంగా ప్రజలు ఎదుర్కొంటున్న రహదారుల కష్టాలు తొలగుతున్నాయి. గత టీడీపీ హయాంలో రహదారులను ఏమాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వదిలేయడంతో ప్రధాన రహదారులతో పాటు గ్రామాల్లోని అంతర్గత రహదారులు సైతం ఛిద్రమై వాహనదారులు, ప్రజలు అనేక ఇబ్బందులు పడేవారు. పెద్ద పెద్ద గోతులతో ప్రయాణం నరకప్రాయంగా ఉండేది. నిత్యం అనేక బాధలు పడాల్సి వస్తుందని, తమ వాహనాలు సైతం పాడైపోతున్నాయని వాహన చోదకులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేసేవారు. ముఖ్యంగా వర్షం వచ్చిందంటే చాలు గోతుల్లో నీరు నిలిచిపోయి ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఆయా సమస్యలన్నింటినీ తొలగిస్తూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేస్తుంది.

మండల పరిషత్ నిధులతో అభివృద్ధి

- తాళ్లరేవు మండలంలో ప్రధానమైన బాబానగర్–తాళ్లరేవు రహదారి, నీలపల్లి–సుంకటరేవు రహదారులను అభివృద్ధి చేశారు. మిగిలిన రహదారులకు మరమ్మతుల పనులు చేస్తున్నారు. అంతేకాకుండా శివారు ప్రాంతాల రహదారులు, గ్రామాల్లో అంతర్గత రహదారులకు సైతం ప్రత్యేక నిధులు కేటాయించి రహదారులను అభివృద్ధి చేస్తున్నారు.
- తాళ్లరేవు మండల పరిషత్ నిధులు సుమారు రూ.కోటి వెచ్చించి కోరంగి పంచాయతీ పెదబొడ్డు వెంకటాయపాలెం, పటవల ఎస్సీపేట, ఈబీసీ కాలనీ, గోవలంక, పెదగోవలంక, తాళ్లరేవు పంచాయతీలోని పెంకేవారిపేట, జెల్లావారిపేట, పి.మల్లవరం పంచాయతీ పత్తిగొంది, జి.వేమవరం, సీతారామపురం, పెదవలసల, నీలపల్లి జగనన్న కాలనీలలో రహదారులను అభివృద్ధి చేశారు.
- మండల పరిధిలోని జాతీయ రహదారి–216ను కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేయడంతో సుంకరపాలెం నుంచి చొల్లంగి వరకూ విస్తరించి ఉన్న జాతీయ రహదారితో పాటు దానికి అనుబంధంగా ఉన్న రహదారులను సైతం అభివృద్ధి చేయడంతో దాదాపుగా మండలంలో రహదారుల సమస్య తొలగిపోయింది. దీర్ఘకాలికంగా ఉన్న రహదారులను అభివృద్ధి చేయడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రూ.కోటి వ్యయంతో అభివృద్ధి



మండల పరిధిలోని పలు గ్రామాల్లో దెబ్బతిన్న రహదారులను రూ.కోటి వెచ్చించి అభివృద్ధి చేస్తున్నాం. ఎంతోకాలంగా అపరిష్కృతంగా ఉన్న రహదారులకు నిధులు కేటాయించి యుద్ధప్రాతిపదికన పనులు చేస్తున్నాం.

– రాయుడు సునీత, ఎంపీపీ, తాళ్లరేవు మండలం

జగనన్న ప్రభుత్వం వచ్చాక అభివృద్ధి



ఇంజరం పంచాయతీ పరిధిలోని పెదగోవలంక రహదారి ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోలేదు. గతంలో అనేక సార్లు మొరపెట్టుకున్నా ఎవరూ పట్టించుకోలేదు. అయితే జగనన్న ప్రభుత్వం వచ్చాక అక్కడ సీసీ రోడ్డు వేసి సమస్య పరిష్కరించారు. చాలా ఆనందంగా ఉంది.

– కోరుకొండ రాజు, పెదగోవలంక

దీర్ఘకాలిక సమస్య పరిష్కరించారు



ఎంతోకాలంగా అభివృద్ధికి నోచుకోని మా గ్రామ రహదారిని ఇటీవలే అభివృద్ధి చేశారు. రహదారి లేకపోవడంతో వర్షాకాలం అనేక ఇబ్బందులు పడాల్సి వచ్చేది. దీర్ఘకాలంగా ఉన్న సమస్యను పరిష్కరించడం ఆనందంగా ఉంది.

– దోనం మణి, పటవల ఎస్సీపేట

ఎన్నో ఇబ్బందులు పడేవాళ్లం



గ్రామంలో సరైన రహదారి, డ్రైనేజీలు లేక ఎన్నో ఇబ్బందులు పడేవాళ్లం. వర్షాకాలంలో అయితే మా బాధలు వర్ణనాతీతం. ప్రస్తుతం రహదారి అభివృద్ధి చేస్తుండడంతో మా సమస్యలు తొలగిపోనున్నాయి.

– పినపోతు పోసియమ్మ, పెద్దబొడ్డు వెంకటాయపాలెం

గ్రామాల్లో రహదారుల అభివృద్ధికి కృషి



ఉప్పలగుప్తంలో బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి విశ్వరూప్



పేరూరులో వాటర్ ట్యాంక్‌కు శంకుస్థాపన చేస్తున్న మంత్రి విశ్వరూప్

రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్

ఉప్పలగుప్తం: గ్రామాల్లో అధ్వానంగా ఉన్న రహదారులను గుర్తించి వాటి అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. మండలంలోని ఉప్పలగుప్తం పంచాయితీ పరిధిలో రూ.90 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న బీటీ రోడ్డు నిర్మాణానికి మంత్రి విశ్వరూప్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒకపక్క ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందిస్తూనే మరోవైపు అభివృద్ధి చేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకుంటే మరెంతో అభివృద్ధి జరుగుతుందని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు, సర్పంచ్ కడిమి చిన్నవరాజు, సర్పంచ్ యర్రంశెట్టి రామచంద్రరావు, ఉప సర్పంచ్ మోకా శ్రీను, పెద్దాపురం ఎన్నికల పరిశీలకుడు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చీకట్ల కిషోర్, మోటూరి సత్యంకాపు, అడబాల మాధవ, చేట్ల విద్యాసాగర్, దోనిపాటి వెంకట రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు

అమలాపురం రూరల్: గ్రామాల్లో తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. పేరూరు గ్రామ పంచాయతీ 10, 11, 12 వార్డుల్లో ఏళ్లుగా నెలకొన్న తాగునీటి ఇబ్బందులను తొలగించేందుకు శుక్రవారం ఆయన తారకరామనగర్ కాలనీలో వాటర్ ట్యాంక్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ కుళాయిలతో వేసవిలో ఇంటింటికీ పూర్తిస్థాయిలో తాగునీరు అందుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పందిరి శ్రీహరిరామ్‌గోపాల్, సర్పంచ్ దాసరి అరుణ, ఎంపీటీసీ వాసంశెట్టి శ్రీనివాసరావు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు బొంతు గోవిందశెట్టి, సుధా గణపతి, మండల సచివాలయ కన్వీనర్ చొల్లంగి సుబ్బిరామ్, వార్డు సభ్యుడు అప్పారి లక్ష్మీనారాయణ, రంకి రెడ్డి సత్తిబాబు, వాసంశెట్టి సత్తిరాజు, కట్టా శ్రీనివాసరావు, గువ్వాల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సౌకర్యాల కల్పనే లక్ష్యం

ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్

యానాం: నియోజకవర్గంలోని వివిధ కాలనీల్లో మౌలిక సౌకర్యాల కల్పనే లక్ష్యంగా కోట్లాది రూపాయల ఖర్చుతో వివిధ నిర్మాణాలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పేర్కొన్నారు. ఆదిద్రావిడ సంక్షేమశాఖ, ఎమ్మెల్యే ల్యాడ్ నిధులు రూ.83.61 లక్షలతో వివిధ గ్రామాల్లో రోడ్లు, డ్రెయిన్లు, శ్మశాన వాటికల్లో సౌకర్యాలకు శుక్రవారం ఆయన శ్రీకారం చుట్టారు. రూ.14.94 లక్షలతో బెజవాడ గార్డెన్స్ మూడో వీధిలో, రూ.20.44 లక్షలతో నాలుగో వీధిలో, రూ.18.54 లక్షలతో కురసాంపేట హిందూ శ్మశానవాటికలో, రూ.4.96 లక్షలతో కురసాంపేటలో, రూ.4.68 లక్షలతో మెట్టకూరు గణపతి నగర్‌లో, రూ.16.08 లక్షలతో పరంపేట సొసైటీ భూములకు రోడ్డు నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఆర్ఏఓ మునిస్వామి, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ, ఏఈ కుమార్, సీఐ షణ్ముగం, ఎస్ఐ నూకరాజు తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్

గీతాంజలికి నివాళిగా కొవ్వొత్తుల ర్యాలీ



తాళ్లరేవులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న మండల పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు

తాళ్లరేవు: ఇటీవలి సోషల్ మీడియాలో తనపై జరిగిన ట్రోల్స్‌ను చూసి తీవ్ర మనస్థాపంతో తెనాలిలో ఆత్మహత్యకు పాల్పడిన గీతాంజలికి నివాళిగా శుక్రవారం తాళ్లరేవు మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక సంతపేట సెంటర్ నుంచి ప్రారంభమైన ర్యాలీ చెరువుగట్టు సెంటర్ వరకూ సాగింది. ఈ సందర్భంగా జెడ్పీటీసీ, పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షుడు దొమ్మేటి శామ్యూల్‌సాగర్ మాట్లాడుతూ భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ అందరికీ ఉందని, కాని ఇతరులను కించపరుస్తూ ఒక మహిళ మృతికి కారణమవ్వడం దారుణమన్నారు. కార్యక్రమంలో పాస్టర్ కె.జయానందకుమార్, డి.శాల్మన్, జాన్ విక్టర్, పి.ప్రసాద్, చిట్టూరి చలపతి, బొంతు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఖురాన్ పఠనాలు.. ఇఫ్తార్ విందులు



అమలాపురంలో రంజాన్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు




అమలాపురం ముల్లా ముస్తాఫా మసీదులో ఇఫ్తార్ విందు చేస్తున్న ముస్లింలు

అమలాపురం టౌన్: పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా పట్టణంలోని ముల్లా ముస్తాఫా, జామియా మసీదుల్లో ముస్లింలు రోజా ఉపవాస దీక్షలు, ఖురాన్ పఠనాలు, ప్రత్యేక ప్రార్థనలు, సాయంత్రం వేళ ఇఫ్తార్ విందుల్లో నిమగ్నమవుతున్నారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకూ ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు, ఖురాన్ పఠనాలు చేశారు. సాయంత్రం స్థానిక ముల్లా ముస్తాఫా మసీదులో ఆత్మీయ వాతావరణంలో ఇఫ్తార్ విందు చేశారు. అమలాపురం జానీ బాషా ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణంలోని పేదలకు అన్నదానం నిర్వహించారు. కోనసీమ ముస్లిం యూత్ అసోసియేషన్ ప్రతినిధి ఎండీ బషీర్ తదితరుల చేతుల మీదుగా అన్నదానం చేశారు. జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, న్యాయవాది ఎండీ ఆజామ్, మున్సిపల్ ఉర్దూ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్‌యూఐ కమిటీ నియామకం

యానాం: యానాం నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా(ఎన్ఎస్‌యూఐ) అసెంబ్లీ కమిటీని నియమిస్తూ పార్లమెంట్ సభ్యుడు వైథిలింగం, అధ్యక్షుడు హర్షవర్ధన్‌లు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. యూనియన్ అధ్యక్షుడిగా కోటి రవికిరణ్, ఉపాధ్యక్షుడిగా బలగం గణేష్, జనరల్ సెక్రటరీలుగా మన్నే వెంకటప్రసాద్, పెనుమళ్ల అరుణ్‌కుమార్, వెంటపల్లి శ్రీనివాస్, మందపల్లి అఖిల్, మసకపల్లి వీరమణికంత, మణికంత, మరో ఆరుగురిని కార్యదర్శులుగా నియమించారు.

ఉజ్వల గ్యాస్ కనెక్షన్ల అందజేత



లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్లను అందజేస్తున్న ఎంపీపీ రాయిడు సునీత

తాళ్లరేవు: నిరుపేద మహిళలకు ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న ఉజ్వల గ్యాస్ కనెక్షన్లను శుక్రవారం స్థానిక ఎంపీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో 36 మంది లబ్ధిదారులకు ఎంపీపీ రాయుడు సునీత అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాయుడు గంగాధర్, చిట్టూరి చలపతి, కుడుపూడి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మూలవాసుల మాసోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న విశ్వజన కళామండలి నాయకులు

ముమ్మిడివరం: విశ్వజన కళా మండలి ఏపీ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో మూలవాసుల మాసోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక డా.బీఆర్ అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు మాట్లాడుతూ మార్చి 15న మాన్యశ్రీ కాన్షీరామ్ జయంతి నుంచి ఏప్రిల్ 14న అంబేడ్కర్ జయంతి వరకూ మూలవాసుల మాసోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో కళామండలి జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాసరావు, రాష్ట్ర టీఎస్‌టీయూసీ ఉపాధ్యక్షుడు యడ్ల సురేష్‌కుమార్, బీవైవీ సత్యనారాయణ, రేవు శ్రీను, గొల్లపల్లి గోపి తదితరులు పాల్గొన్నారు.


శాశ్వత విద్యానిధికి దాతల విరాళం



కోనసీమ దేవాంగ సంక్షేమ సంఘు అధ్యక్షుడు వూటుకూరికి విరాళాలు అందిస్తున్న దాతలు

అమలాపురం రూరల్: కోనసీమ దేవాంగ సంక్షేమ సంఘం శాశ్వత విద్యానిధికి బండారులంక చినచంద్రపురానికి చెందిన పలువురు దాతలు రూ.80,116 విరాళంగా ఇచ్చారు. శుక్రవారం చినచంద్రపురంలో పర్యటించిన గ్రామ దేవాంగ సంఘం అధ్యక్షుడు బళ్ల వెంకటేశ్వరరావు, కోనసీమ దేవాంగ సంక్షేమ సంఘ అధ్యక్షుడు వూటుకూరి సుబ్రహ్మణ్యేశ్వరస్వామిలకు రాజశేఖర్ రూ.30,116, బళ్ల సుబ్రహ్మణ్యం రూ.10,000, బళ్ల చిన పుల్లయ్య రూ.10,000, అల్లాడ సాంబశివరావు, కారుపర్తి మల్లేశ్వరరావు, మావూరి భాస్కరరావు, బళ్ల తాతారావు, ఉప్పుగంటి భాస్కరరావు, బళ్ల మల్లేశ్వరరావులు రూ.5,000 చొప్పున అందజేశారు. కార్యక్రమంలో పిచ్చిక శ్యామ్, చింతపట్ల గంగా సత్యనారాయణ, కాలెపు నాగ శ్రీనివాసరావు, కాశిన చిట్టిరాజు, కొండా సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు అభినందనలు



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ గంగాభవానీ తదితరులు

ముమ్మిడివరం: జాతీయ విజ్ఞాన శాస్త్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని తానేల్లంక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో గురువారం ఏర్పాటుచేసిన సైన్సు ఎక్స్‌పోలో ప్రతిభ కనబరిచిన 50 మంది విద్యార్థినులకు ప్రిన్సిపాల్ టి.గంగాభవాని ప్రశంసా పత్రాలు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శివ ప్రవీణ, ఉపాధ్యాయులు సునీత కుమారి, కేపీఎంఎల్ లత, పద్మ రాణి, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా నాగమణి



నాగమణిని అభినందిస్తున్న మాజీ మంత్రి వెల్లంపల్లి తదితరులు

తాళ్లరేవు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా కోరింగా ఫార్మసీ కళాశాల డైరెక్టర్ డా.ప్రగల్లపాటి నాగమణి శుక్రవారం విజయవాడలో మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు.

ఈ సందర్భంగా నాగమణిని కోరింగా ఫార్మసీ కళాశాల చైర్మన్ దున్నా జనార్దనరావు, కరస్పాండెంట్ పి.కనకరాజు, డైరెక్టర్‌లు చిట్టూరి కలికి మూర్తి, గుండు సాయికృష్ణ, ర్యాలి సత్యనారాయణ, తాళ్లరేవు వాసవీ క్లబ్ గవర్నర్ గోకవరపు సుభాష్, కొమ్మూరి శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

దేవస్థానం భూమి ఆక్రమణపై ఫిర్యాదు



ఆర్ఏఓ మునిస్వామికి వినతి పత్రం అందిస్తున్న నాయకులు

యానాం: యానాంలో కొలువైన భూసమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయానికి చెందిన భూమి ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆర్ఏఓ మునిస్వామికి దరియాలతిప్ప గ్రామానికి చెందిన విడుతలై చిరుతైగల్ కచ్చి పార్టీ నాయకులు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. యానాం శివారు అడివిపొలం గ్రామంలో ఉన్న ఆలయ భూమిని దరియాలతిప్ప గ్రామానికి చెందిన మల్లాడి సత్తిబాబు అనే వ్యక్తి నకిలీ పత్రాలు సృష్టించి చమురు సంస్థలకు లీజుకు ఇస్తున్నాడని వారు ఆరోపించారు. తక్షణం అధికారులు స్పందించి దేవస్థానం భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మోకా బుజ్జి, మెల్లం శ్రీను, సబ్బితి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

లంక గ్రామాల్లో పోలీస్ కవాతు

ముమ్మిడివరం: ఎన్నికలు సక్రమంగా సజావుగా నిర్వహించే చర్యల్లో భాగంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం లంక గ్రామాల్లో కవాతు నిర్వహించారు. ముమ్మిడివరం సీఐ ఎన్.కొండయ్య, ఎస్ఐ డి.సురేష్ బాబు ఆధ్వర్యంలో సీఐఎస్ఎఫ్ సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్‌కు చెందిన 70 మంది పోలీసులు మండలంలోని వివేకా వారధి నుంచి గురజాపులంక, కూనాలంక, లంకాఫ్ ఠానేల్లంక గ్రామాల్లో కవాతు చేశారు. ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

రొయ్యల మేత వ్యాన్ బోల్తా

అంబాజీపేట: ముక్కామల–అమలాపురం బైపాస్ రోడ్డులో రొయ్యల మేతతో వెళుతున్న వ్యాన్ శుక్రవారం ఉదయం అదుపుతప్పి పక్కనున్న పంట బోదెలో బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొవ్వూరు నుంచి అమలాపురం వైపు రొయ్యల మేతతో వెళుతున్న వ్యాన్.. మొసలపల్లి సమీపంలో అదుపుతప్పి బోల్తా కొట్టింది. వ్యాన్‌లో ఉన్న డ్రైవర్‌తో పాటు, మరొకరు సురక్షితంగా బయటపడ్డారు. ఎవరికీ ఎటువంటి అపాయం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.